క్లుప్తంగా

కలెక్టరేట్‌లో తెలంగాణ ఇంజినీర్స్‌ డే



నివాళి అర్పిస్తున్న అదనపు కలెక్టర్‌ ఖీమ్యానాయక్, తదితరులు

సిరిసిల్లఅర్బన్‌: తెలంగాణ రాష్ట్ర సాగునీటి పారుదల ప్రాజెక్టులను రూపకల్పన చేసి, ఎన్నో చారిత్రక కట్టడాలను నిర్మించిన ఆలీ నవాజ్‌ జంగ్‌ బహదూర్‌ రాష్ట్రానికి అందించిన సేవలు చిరస్మరణీయమని అదనపు కలెక్టర్‌ ఖీమ్యానాయక్‌ అన్నారు. తెలంగాణ ఇంజనీర్స్‌ డే వేడుకలను బుధవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలీ నవాజ్‌ జంగ్‌ బహదూర్‌ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించి మాట్లాడారు. సాగునీటి రంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, చరిత్రలో నిలిచిపోయే కట్టడాలను నిర్మించారని కొనియాడారు. కార్యక్రమంలో మిషన్‌ భగీరథ ఎస్‌ఈ రవీందర్, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయితీరాజ్‌ ఈఈ సూర్య ప్రకాశ్, డీఈఈ, ఏఈఈలు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న ప్రజాప్రతినిధులు

గంభీరావుపేట: గంభీరావుపేటలో రోడ్డు విస్తరణ, ఫోర్‌లైన్‌ నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ బీఆర్‌ఎస్‌ నాయకులు మంగళవారం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం గంభీరావుపేట నుంచి పెద్దమ్మ స్టేజీ వరకు బైక్‌ ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలో సమీకృత కూరగాయల మార్కెట్‌ కోసం రూ.కోటి, హైలెవల్‌ వంతెన నిర్మాణానికి రూ.14 కోట్లు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ కటకం శ్రీధర్‌పంతులు, ఎంపీపీ వంగ కరుణ, బీఆర్‌ఎస్‌ మండల శాఖ అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, వైస్‌ఎంపీపీ దోసల లత, సెస్‌ డైరెక్టర్‌ నారాయణరావు, ఏఎంసీ మాజీ చైర్మన్‌ దయాకర్‌రావు, ఉపసర్పంచ్‌ నాగరాజుగౌడ్‌ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్‌

తంగళ్లపల్లి: స్థానిక ఇంపీరియల్‌ గార్డెన్‌లో మంగళవారం రోడ్డు భద్రత ప్రమాణాల అవగాహన సదస్సులో చీర్లవంచ పీహెచ్‌సీ మెడికల్‌ అధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స, సీపీఆర్‌ ఎలా చేయాలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సిరిసిల్ల రూరల్‌ సీఐ బి.ఉపేందర్‌ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి, రోడ్‌ సేఫ్టీ విలేజ్‌ కమిటీ సభ్యులు, వాహనదారులు పాల్గొన్నారు.

నెరవేరని లక్ష్యం

- తరగతి గదులే రీడింగ్‌ రూములు
- గదుల కొరతనే కారణం
- చదవడం, రాయడం సామర్థ్యాల పెంపు అయ్యేనా?
- చిల్డ్రన్‌ లైబ్రరీపై పట్టింపేదీ
- లైబ్రరీకి అవసరమైన ప్రత్యేక వాతావరణం కరువు

ముస్తాబాద్‌ విద్యార్థుల్లో పఠనాశక్తి పెంచేందుకు ఉద్దేశించి ప్రభుత్వం చేపట్టిన రీడింగ్‌ రూమ్‌ లక్ష్యం నేరవేరడం లేదు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదవడం, రాయడంలో వెనుకబాటుకు గురైన నేపథ్యంలో ఎస్‌సీఈఆర్‌టీ, రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ సంయుక్తంగా ఒక్కో ప్రాథమిక పాఠశాలలో 120 రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచింది. ముస్తాబాద్‌ మండలంలో 11 ప్రాథమిక పాఠశాలలను గతేడాది గుర్తించిన అధికారులు అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. పుస్తకాలు ఉంచేందుకు వుడెన్‌ ర్యాక్స్, ఆంగ్లం, తెలుగు మీడియంలో 120 రకాల పుస్తకాలను సరఫరా చేశారు.



ముస్తాబాద్‌ ప్రాథమిక పాఠశాలలో రీడింగ్‌ రూమ్‌లో కొనసాగుతున్న రెండు తరగతులు



కొండాపూర్‌ పీఎస్‌లో లైబ్రరీ కమ్‌ తరగతి గది

కనిపించని రీడింగ్‌ రూములు

మండలంలోని 11 ప్రాథమిక పాఠశాలు మద్దికుంట, మోహినికుంట, ముస్తాబాద్‌ అంబేద్కర్‌నగర్, పోతుగల్‌ అంబేద్కర్‌నగర్, గూడూరు, వెంకట్రావుపల్లె, రామలక్ష్మణపల్లె, మొర్రాపూర్, తుర్కపల్లె, బందనకల్, కొండాపూర్‌లో రీడింగ్‌ రూమ్‌లు ఏర్పాటు చేశారు. అయితే పలు పాఠశాలల్లో తరగతి గదుల కొరతతో క్లాస్‌రూమ్‌ల్లోనే రీడింగ్‌ రూమ్‌లు ఏర్పాటు చేశారు. లైబ్రరీకి ప్రత్యేక గది లేకపోవడంతో పుస్తక పఠనం చేయాలనే ఉత్సాహం విద్యార్థుల్లో కనిపించడం లేదు. వారానికి మూడు రోజులు ఇంగ్లిష్, మూడు రోజులు తెలుగు పుస్తకాలు చదవాల్సి వుండగా, పుస్తక పఠనానికి అవసరమైన వాతావరణం లేకపోవడంతో శ్రద్ధ పెట్టడం లేదని ఉపాధ్యాయులు అంటున్నారు. ముస్తాబాద్‌ అంబేద్కర్‌నగర్‌ ప్రాథమిక పాఠశాలలో 55 మంది విద్యార్థులు ఉండగా, వున్నవి రెండే గదులు. దీంతో ఒకే గదిలో 3, 5 తరగతులు నిర్వహిస్తూ ఒక పక్కగా రీడింగ్‌ రూమ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఇదే పరిస్థితి అంతటా కనిపిస్తోంది.

రీడింగ్‌ రూం లక్ష్యం ఇదీ..

➡ చిన్నారుల్లో పఠనాసక్తిని పెంపొందించడంతోపాటు రాయడం, చర్చల్లో పాల్గొనేలా చేయాలి.
➡ రోజు చివరి పీరియడ్‌లో 45 నిమిషాలు ఇందుకు కేటాయించాలి.
➡ చిన్న పదాలు, వాక్యాలు, పేర గ్రాఫ్‌ చదువుతూ చివరికి కథను చదవాలి.
➡ వారిలో చదివే స్థాయిలను పెంచాలి. అలాగే రాయడం వంటివి కూడా చేయించాలి.
➡ పఠనం ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించాలి.

చిన్నారుల్లో మౌలిక భాష, గణితం సామర్థ్యాలను పెంపొందించేందుకు తొలిమెట్టును మొదట అమలు చేశారు. దాని నుంచి రీడింగ్‌ రూమువైపు అడుగులు పడేలా చేయడం ప్రధాన లక్ష్యం. ఇందుకోసం చిల్డ్రన్‌ లైబ్రరీ మెనేజ్‌మెంట్‌ కమిటీని వేస్తారు. ఇందులో మూడు తరగతుల నుంచి విద్యార్థులను ఎంపిక చేస్తారు. వారే పిల్లలు చదివేలా ప్రోత్సహిస్తారు. అవసరమైన వారికి ఇంటికి పుస్తకాలను ఇస్తారు. మళ్లీ సేకరిస్తారు.

గందరగోళానికి గురై..

పాఠాలు నేర్చుకునే గదిలోనే గ్రంథాలయం ఉండడంతో విద్యార్థులు గందరగోళానికి గురవుతున్నారు. ప్రత్యేక లైబ్రరీ లేనందున ఆ ప్రత్యేక వాతావరణం పిల్లల్లో కనిపించడం లేదు. రొటీన్‌కు భిన్నంగా రంగురంగుల్లో ఉండే పెద్ద చిత్రాలతో ఉన్న పుస్తకాలు, చిన్న వ్యాక్యాలతో ఉండే కథనం వారిని ఆకర్షించలేకపోతున్నాయంటున్నారు. ప్రత్యేక పీరియడ్‌ ఉన్నప్పుడు ప్రత్యేక రీడింగ్‌ రూమ్‌ ఉన్నట్లైతే వారికి ఉపయోగంగా ఉండేది. గూడూరు ప్రాథమిక పాఠశాలలో అదనపు గదులు ఉన్నప్పటికీ, వాటిని అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించడంతో ఇక్కడ తరగతి గదిలోనే రీడింగ్‌ రూమ్‌ ఏర్పాటు చేశారు.

లైబ్రరీకి గది ఉండాలి



మా స్కూల్‌లో రీడింగ్‌ రూమ్‌లో అన్ని రకాల పుస్తకాలు ఉన్నాయి. అవి మమ్మల్ని చదివేలా చేస్తున్నాయి. కానీ లైబ్రరీకి ప్రత్యేక గది ఉంటే ఇంకా బాగుంటుంది. స్పెషల్‌ పీరియడ్‌లో అక్కడికి వెళ్లి చదువుకోవడం బాగుంటుంది. రీడింగ్‌ రూమ్‌కు ప్రత్యేక గదిని కేటాయించాలి.

– కావ్య, ఐదో తరగతి, ముస్తాబాద్‌

పఠనాసక్తి పెంచాలి



ప్రభుత్వ లక్ష్యం మంచిదే. కానీ రీడింగ్‌ రూమ్‌లకు గదులు కేటాయించకపోవడం విచారకరం. కోవిడ్‌ తర్వాత పిల్లల్లో చదవడం, రాయడం తగ్గింది. ప్రస్తుత సెల్‌ఫోన్‌లు, టీవీలతో పిల్లలు చదవడం లేదు. పఠనాసక్తిని పెంచి పిల్లలను తీర్చిదిద్దాలి.

– అరుట్ల మహేశ్‌రెడ్డి, ముస్తాబాద్‌

ప్రత్యేక గదులుండాలి



పిల్లల్లో ఉత్సాహం వచ్చింది. పుస్తకాల్లో ఉన్న కథలు, కార్టూన్లు చదివి పిల్లలు హ్యాపీగా ఉన్నారు. మా స్కూల్‌లో రెండు తరగతులు నిర్వహిస్తున్న గదిలోనే రీడింగ్‌రూమ్‌ ఏర్పాటు చేశాం. దీంతో పిల్లలు అది కూడా క్లాస్‌గానే భావిస్తున్నారు. రీడింగ్‌ రూమ్‌కు ప్రత్యేక గదిని నిర్మిస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.

– కాల్వ కైలాష్, హెచ్‌ఎం, ముస్తాబాద్‌

పంచాయతీ కార్మికుల సమస్య పరిష్కరిస్తాం

- మానకొండూర్‌ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్‌ రసమయి బాలకిషన్‌



పంచాయతీ కార్మికులతో ఎమ్మెల్యే రసమయి

ఇల్లంతకుంట: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యను ప్రభుత్వం తప్పకుండా పరిష్కరిస్తుందని మానకొండూర్‌ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్‌ రసమయి బాలకిషన్‌ అన్నారు. మండల పరిషత్‌ ఎదుట సమ్మె చేస్తున్న జీపీ కార్మికులను మంగళవారం కలిసి మాట్లాడారు. సమస్యలు ఏమైనా ఉంటే చెప్పాలని, తాను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. తాను అసెంబ్లీలో మాట్లాడిన తర్వాతనే సీఎం కేసీఆర్‌ జీపీ కార్మికులకు వేతనాలు పెంచారని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 50 వేల మంది జీపీ కార్మికులు పని చేస్తున్నారని, గ్రామాల అభివృద్ధిలో జీపీ కార్మికులదే కీలక పాత్ర అని అన్నారు. మండలంలోని వంతడుపుల గ్రామంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేసి మాట్లాడారు. ఆడబిడ్డ పెళ్లి తల్లిదండ్రులకు భారం కావొద్దనే లక్ష్యంతో సీఎం కేసీఆర్‌ ఈ పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. పెద్దలింగాపూర్‌ గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్‌ఎస్‌ గ్రామశాఖ అధ్యక్షుడు సంకటి కొంరయ్య కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్‌ సిద్దం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చల్ల నారాయణ, వైస్‌ఎంపీపీ శ్రీనాథ్‌గౌడ్, సింగిల్‌విండో చైర్మన్‌ తిరుపతిరెడ్డి, సర్పంచులు జితేందర్, వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహరెడ్డి పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులు నయం



కోనరావుపేట: ఆయుర్వేద మందులతో దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయని ఆయుర్వేద డాక్టర్‌ కల్యాణి అన్నారు. మండలంలోని మామిడిపల్లిలో ఆయుష్‌ శాఖ ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆరోగ్య సూత్రాలకు సంబంధించిన పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫార్మాసిస్ట్, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి యువ ఉత్సవ్‌ పోస్టర్‌ ఆవిష్కరణ



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, ఖీమ్యానాయక్‌

సిరిసిల్లఅర్బన్‌: సిరిసిల్ల పట్టణంలోని జిల్లా రైతు వేదికలో ఈనెల 14న జరగనున్న జిల్లా స్థాయి యువ ఉత్సవ్‌ కార్యక్రమానికి సంబంధించి వాల్‌ పోస్టర్‌ను అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, ఎన్‌.ఖీమ్యానాయక్‌ మంగళవారం ఆవిష్కరించారు. యువ ఉత్సవ్‌ కార్యక్రమంలో జిల్లాలోని యువతీ యువకులు పాల్గొని ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 15 నుంచి 29 ఏళ్ల లోపు వయస్సు గల యువతకు కవిత్వం, పేయింటింగ్, మొబైల్‌ ఫొటోగ్రఫీ, ఉపన్యాస పోటీలు నిర్వహించబడునని నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి వెంకట్‌ రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో డీపీఆర్వో మామిండ్ల దశరథం తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె



ఇల్లంతకుంట: సంఘీభావం తెలుపుతున్న దరువు ఎల్లన్న



బోయినపల్లి: అంబేద్కర్‌ విగ్రహానికి వినతిపత్రం



చందుర్తిలో..

ఇల్లంతకుంట/బోయినపల్లి/కోనరావుపేట/చందుర్తి/ఎల్లారెడ్డిపేట/తంగళ్లపల్లి/వీర్నపల్లి: నిరవధిక సమ్మె చేస్తున్న జీపీ కార్మికులు అన్ని మండల కేంద్రాల్లో మంగళవారం ర్యాలీలు నిర్వహించి అంబేద్కర్‌ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఇల్లంతకుంటలో బీజేపీ నాయకుడు, కేంద్ర సెన్సార్‌ బోర్డు సభ్యుడు దరువు ఎల్లన్న, ఎల్లారెడ్డిపేటలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు వరదవెల్లి స్వామిగౌడ్, బోయినపల్లిలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎగమంటి ఎల్లారెడ్డి సమ్మెకు సంఘీభావం తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, వీర్నపల్లి ఎంపీటీసీ అరుణ్‌ కుమార్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విలాసాగర్‌ చెరువు ఆయకట్టుకు నీటి విడుదల



పూజలు చేస్తున్న ఎంపీపీ వేణుగోపాల్‌

బోయినపల్లి: మండలంలోని విలాసాగర్‌ చెరువు నీటిని తూము ద్వారా చెరువు కింద ఆయకట్టు రైతులకు ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్‌ మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్ది రోజులుగా వరద కాలువ నీటిని ఎత్తిపోతలతో విలాసాగర్‌ చెరువు నింపినట్లు తెలిపారు. ప్రస్తుతం చెరువు కింద వానాకాలం సీజన్‌లో పంటలు వేసుకున్న రైతుల కోసం విడుదల చేసినట్లు తెలిపారు. చెరువు కింద సుమారు 700 ఎకరాల మేర ఆయకట్టు ఉందన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో అనంతపల్లి, మల్కాపూర్, బూర్గుపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు రూ.50 వేల చొప్పున ఎస్సీ కార్పొరేషన్‌ పెట్టీ యూనిట్స్‌ మంజూరు పత్రాలు అందించారు. వైస్‌ఎంపీపీ నాగయ్య, ఎంపీడీవో నల్లా రాజేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, జూలపల్లి అంజన్‌రావు, సంబ లక్ష్మీరాజం, నిమ్మ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం



మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్లఅర్బన్‌: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని టీఎస్‌పీటీడీసీ చైర్మన్‌ గూడూరి ప్రవీణ్‌ అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలోని స్థానిక 2, 13, 14వ వార్డుల్లో పార్టీ అధ్యక్షుడు జిందం చక్రపాణి అధ్యక్షతన బీఆర్‌ఎస్‌ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రం అన్ని రంగాల్లో సీఎం కేసీఆర్‌ నేతృత్వంలో అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్‌ ఆకునూరి శంకరయ్య, వార్డుల ఇన్‌చార్జి బొల్లి రాంమోహన్, మున్సిపల్‌ వైస్‌చైర్మన్‌ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్‌ నాయకులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలం అక్కపల్లి, దుమాల గ్రామాల్లో మంగళవారం బూత్‌ కమిటీలను బీఆర్‌ఎస్‌ పార్టీ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి రేణుక, సింగిల్‌విండో చైర్మన్‌ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'కొండూరు' జన్మదిన వేడుకలు

గంభీరావుపేట: టెస్కాబ్‌ చైర్మన్‌ కొండూరు రవీందర్‌రావు జన్మదిన వేడుకలను గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు లింగన్నపేటలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ తల్లి విగ్రహం దగ్గర కేక్‌ కట్‌ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపీపీ వంగ కరుణ, సర్పంచ్‌ కటకం శ్రీధర్‌పంతులు, వైస్‌ఎంపీపీ లత, సెస్‌ డైరెక్టర్‌ నారాయణరావు, సింగిల్‌విండో చైర్మన్‌ భూపతి సురేందర్, ఏఎంసీ మాజీ చైర్మన్‌ దయాకర్‌రావు, ఉపసర్పంచ్‌ నాగరాజుగౌడ్, బీఆర్‌ఎస్‌ మండల శాఖ అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, పట్టణశాఖ అధ్యక్షుడు వెంకటియాదవ్‌ పాల్గొన్నారు.

స్టేడియం నిర్మాణ పనులు పరిశీలన



వేములవాడఅర్బన్‌: వేములవాడ మున్సిపల్‌ పరిధి తిప్పాపూర్‌ శివారులో నిర్మాణంలో ఉన్న మినీ స్టేడియం పనులను కబడ్డీ అసోసియేషన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి సింగారపు తిరుపతి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి క్రీడలను ప్రోత్సహిస్తున్నందుకు అభినందనీయమన్నారు. కబడ్డీ క్రీడలో ఈ ప్రాంతానికి రాష్ట్రస్థాయిలోనే మంచిపేరు ఉందన్నారు. వేములవాడలో కబడ్డీ అకాడమీ ఏర్పాటు చేయాలని కోరారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యతనివ్వాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్‌ ఉపాధ్యక్షుడు బొడ్డు రాములు, తిరుపతిరెడ్డి, నారాయణ, మల్లేశం పాల్గొన్నారు.

కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుచేయాలి



మాట్లాడుతున్న రవిగౌడ్‌

సిరిసిల్లఅర్బన్‌: ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ఇంటర్మీడియెట్‌ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి రాష్ట్ర కోఆర్డినేటర్‌ కంచర్ల రవిగౌడ్‌ మాట్లాడుతూ, గతంలో విద్యాశాఖ మంత్రిగా ఉన్న కడియం శ్రీహరి ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తామని ప్రకటించారని, ఆరేళ్లు గడుస్తున్నా అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. విద్యార్థుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. జిల్లా డివిజన్‌ ఇన్‌చార్జి ఇల్లందుల ప్రకాశ్, నాయకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎగమంటి ఎల్లారెడ్డి

వేములవాడఅర్బన్‌: పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కారించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి అన్నారు. స్థానిక విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజన కార్మికుల పెండింగ్‌ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. కొత్త మెనూను సవరించాలన్నారు. ప్రమాద బీమా, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని, నిర్వహణను అక్షయపాత్రలాంటి సంస్థలకు ఇవ్వరాదన్నారు. జిల్లా నాయకులు చిలుక బాబు, ప్రశాంత్, అశోక్, సాయి పాల్గొన్నారు.


రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



తంగళ్లపల్లి: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఇల్లంతకుంట/తంగళ్లపల్లి: రైతులకు ఉచిత విద్యుత్‌ అవసరం లేదని, మూడు గంటలు సరిపోతుందని టీపీసీసీ చీఫ్‌ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసిస్తూ ఇల్లంతకుంట మండల కేంద్రం, సారంపల్లి–బద్దెనపల్లి టెక్స్‌టైల్‌ పార్కు గేటు ఎదుట రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను టీఆర్‌ఎస్‌ నాయకులు దహనం చేశారు. జెడ్పీ వైస్‌చైర్మన్‌ సిద్దం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహరెడ్డి, బీఆర్‌ఎస్‌ యూత్‌ నాయకుడు సిలివేరి చిరంజీవి, రైతు సెల్‌ మండల ఉపాధ్యక్షుడు కొక్కిరాల ఆగంరావు, మాజీ సర్పంచ్‌ పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

దళితుల సంక్షేమానికి పెద్దపీట



చెక్కులు అందిస్తున్న ఎంపీపీ శరత్‌రావు

ముస్తాబాద్‌: దళితుల సంక్షేమం, అభివృద్ధికి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంపీపీ జనగామ శరత్‌రావు అన్నారు. స్థానిక మండల పరిషత్‌లో ఎస్సీ కార్పొరేషన్‌ ద్వారా 24 మంది యువతీ, యువకులకు స్వయం ఉపాధి కోసం మంజూరైన రూ.12 లక్షల విలువైన చెక్కులను మంగళవారం పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్‌ డైరెక్టర్‌ సందుపట్ల అంజిరెడ్డి, ఎంపీటీసీ మంజుల, కోఆప్షన్‌ సభ్యుడు షాదుల్, సూపరింటెండెంట్‌ శ్రీనివాస్, సీనియర్‌ అసిస్టెంట్‌ సురేశ్‌నాయక్, నర్సింలు పాల్గొన్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవం



ముస్తాబాద్‌లో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ

ముస్తాబాద్‌: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మండలంలోని పోతుగల్‌ పీహెచ్‌సీలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి గీతాంజలి, సీహెచ్‌వో సారాబాయి, హెచ్‌ఈవో యాదగిరి, పీహెచ్‌ఎన్‌ జ్యోతి, స్టాఫ్‌నర్స్‌ రమ్య, రాజేశ్వరి, సాహిత్య, సూపర్‌వైజర్‌ వరలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన మనోహర్‌రెడ్డి



వేములవాడఅర్బన్‌: హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్‌ను వేములవాడ బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు.

విద్యార్థులకు కథల పుస్తకాలు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: కవి, రచయిత, బహుభాషా కోవిదులు నలిమెల భాస్కర్‌ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు అందించిన కథల పుస్తకాలను మండల నోడల్‌ అధికారి మద్దికుంట లక్ష్మణ్, హెచ్‌ఎం దబ్బెడ హన్మండ్లు మంగళవారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో చదివే అలవాటును పెంపొందించేందుకు పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పుస్తకాలు అందించిన భాస్కర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

హైమస్ట్‌ లైట్లు ప్రారంభం

రుద్రంగి: మండల కేంద్రంలోని మార్కండేయ, సార్గమ్మ ఆలయాల వద్ద జెడ్పీ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్‌ లైట్లను జెడ్పీటీసీ గట్ల మీనయ్య మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సెస్‌ డైరెక్టర్‌ ఆకుల గంగారాం, ఏఎంసీ వైస్‌ చైర్మన్‌ కంటి రెడ్డి, నాయకులు పూదరి శ్రీనివాస్, పడాల గణేశ్, పద్మశాలి సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.